సాక్షి
కాకినాడ

గురువారం । 2 । జనవరి । 2025



మింగేసిన రాకాసి అలలు

సముద్ర తీరాన రాకాసి కెరటం మృత్యువై లాగేసింది.. మూడు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది.. కొత్త వత్సరం వారి ఇంట కన్నీరు మిగిల్చింది.


8 లో



సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఏ శైలేంద్రనాథ్, పద్మావతి (వేట్లపాలెం) రూ.లక్ష విరాళాన్ని బుధవారం అందజేశారు.

11,200 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 11,200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,300, మధ్య డెల్టాకు 2,150, పశ్చిమ డెల్టాకు 5,750 క్యూసెక్కుల నీరు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

సత్యదేవుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి బుధవారం వేలసంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి స్వామివారి ఆలయానికి భక్తుల రాక మొదలైంది. సాయంత్రం వరకు ఇది కొనసాగింది. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంత మండపాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు 1,800 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

ఎస్పీకి పదోన్నతి



విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు పదోన్నతి లభించింది. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్ఎస్‌పీ)గా పదోన్నతి కల్పిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 2012 బ్యాచ్‌కు చెందిన విక్రాంత్ పాటిల్ విజయనగరం జిల్లాలో ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా, చిత్తూరు ఎస్పీగా, గుంతకల్ రైల్వేస్ ఎస్పీగా, విజయవాడ డీసీగా, విజయనగరం ఐదవ బెటాలియన్ ఏపీఎస్పీ కమాండెంట్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా పనిచేశారు. అక్కడి నుంచి గత ఏడాది జూలై 17వ తేదీన కాకినాడ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు.

కిక్కిరిసిన అయినవిల్లి



స్వామివారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం బుధవారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారి పంచామృత అభిషేకాల్లో నలుగురు, లఘున్యాస అభిషేకాల్లో 145 మంది, పరోక్ష అభిషేకాల్లో ఇద్దరు, స్వామివారి గరిక పూజలో ముగ్గురు, ఉండ్రాళ్ల పూజలో ఒకరు, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 27 మంది పాల్గొన్నారు. ఒక చిన్నారికి అక్షరాభ్యాసం, ఐదుగురు చిన్నారులకు అన్నప్రాసన, ఆరుగురికి తులాభారం చేశారు. 74 మంది భక్తులు వాహన పూజ చేయించుకోగా, స్వామివారి అన్నప్రసాదం 6,598 మంది భక్తులు స్వీకరించారు. ఈ ఒక్కరోజే రూ.4,49,861 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

వీరేశ్వరుని సన్నిధిలో శుభలేఖలకు పూజలు

ఐ.పోలవరం: మురమళ్లలో కొలువైన శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయానికి భక్తులు పంపిన శుభలేఖలను స్వామి, అమ్మవార్ల పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఆలయంలో స్వామివారికి కల్యాణం జరుగుతోంది. ముఖ్యంగా పెళ్లికాని యువతీ యువకులు ఇక్కడ స్వామివారికి కల్యాణం జరిపిస్తే అతి శీఘ్రంగా వివాహం జరుగుతుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో భక్తులు పోస్ట్‌ద్వారా పంపిన శుభలేఖలను స్వామి పాదాల చెంత ఉంచి పూజలు చేస్తున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.

జోన్ 2 లో స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య, ఆరోగ్యశాఖ జోన్ 2 పరిధిలో స్టాఫ్‌నర్సుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ఆర్‌జేడీ పద్మశశిధర్ బుధవారం తెలిపారు. జోన్ 2 పరిధి పూర్వపు తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో ఒక సంవత్సరం ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తులను రాజమహేంద్రవరంలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు సీడబ్ల్యూ.ఏపీ.నిక్.ఇన్ వెబ్‌సైట్‌ను చూడవచ్చన్నారు.

అన్నదాతకు మరో ఘాతం



వ్యవసాయం దండగ అని ప్రగాఢంగా నమ్మే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ రంగానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వరనేది అందరికీ తెలిసిందే. ఎన్నికల వేళ రైతులను ప్రసన్నం చేసుకోవడానికి ఎన్నో హామీలు ఇవ్వడం.. ఆనక అటకెక్కించడం ఆయనకు పరిపాటి. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పోయే ఇప్పటికే పొందుతున్న సదుపాయాలను, రాయితీలను దూరం చేస్తుండడం రైతులను ఇబ్బందుల పాలు చేస్తోంది. అన్నదాతా సుఖీభవ ఊసెత్త కుండా, ఉచిత పంటల బీమాకు మంగళం పాడిన ఆయన తాజాగా ఆర్బీకేలను మూతవేసే దిశగా వేస్తున్న అడుగులు సాగును సంక్షోభంలోకి నెడుతున్నాయి.

- ఆర్బీకే వ్యవస్థకు మంగళం పాడనున్న కూటమి సర్కారు
- ఇప్పటికే గ్రామాల్లో సేవలు బంద్ చేసిన వైనం
- జిల్లాలో 414 రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర
- విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందక రైతులకు ఇక్కట్లు

కాకినాడ సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సేవలు అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల వ్యవస్థకు మంగళం పాడేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. జిల్లాలో మెట్ట ప్రాంత మండలాలతో పాటు మిగతా మండలాల్లోనూ ఇకపై రైతులకు అందే సేవలు నిలిచిపోనున్నాయి. వరి ఈ–క్రాప్ ఆధారంగా రేషనలైజేషన్ పేరుతో వీఏఏ (విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్)లను బదిలీ చేయడంతో చాలాచోట్ల ఆర్బీకేలు శాశ్వతంగా మూతపడనున్నాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రామ స్థాయిలోనే ఆర్బీకే వ్యవస్థను రూపొందించారు. ఊరు దాటకుండానే వ్యవసాయశాఖ సేవలను రైతులు పొందారు. ఇప్పుడు ఆ వ్యవస్థను దశలవారీగా నిర్వీర్యం చేసేందుకు కూటమి సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఆర్బీకేల్లో రైతులకు ఉపయోగపడే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితర సేవలకు మంగళం పాడేశారు. కేవలం పేరుకే రైతు భరోసా కేంద్రాలు అన్నట్లు గ్రామాల్లో కన్పిస్తున్నాయి తప్ప రైతులకు ఉపయోగపడే ఏ సేవలూ కొనసాగడం లేదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక, రైతుల ఆత్మబంధువైన ఆర్బీకే వ్యవస్థకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది. ఈ వ్యవస్థను ఆది నుంచీ వ్యతిరేకించిన చంద్రబాబు, అధికారంలోకి రాగానే నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తూ వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యవస్థ ప్రాధాన్యం తగ్గించి వైఎస్ జగన్ ముద్రను చెరిపేసే కుట్ర చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఆర్బీకేలను అదృశ్యం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగానే వీఏఏలను రేషనలైజేషన్ పేరుతో బదిలీ చేశారంటున్నారు.

ఇప్పటికే మెట్ట ప్రాంతాలకు తీవ్ర అన్యాయం

మెట్ట మండలాల్లో ముఖ్యంగా మినుము, పెసర, మొక్కజొన్న, మిరప, జొన్న, పొద్దు తిరుగుడు, పసుపు, వేరుశనగ, పొగాకు, సజ్జ, పత్తితో పాటు మామిడి, బత్తాయి, అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలు కూడా సాగు చేస్తారు. ఈ రైతుల సౌకర్యార్థం జిల్లాలో 414 మంది వీఏఏలతో రైతు భరోసా కేంద్రాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామ స్థాయిలో రైతులకు సేవలు అందజేసింది. ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల్లో సేవలు లేకపోవడంతో ఇటు మెట్ట, అటు డెల్టా ప్రాంతాల రైతులు గగ్గోలు పెడుతున్నారు.

సుఖీభవ కోసం నిరీక్షణ

కూటమి ప్రభుత్వం రబీ సీజన్‌లోనైనా అన్నదాతా సుఖీభవ పథకం కింద నగదు సాయం అందజేస్తుందని రైతులు ఆశించారు. అయితే ఆ ఊసే ఎత్తకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు అప్పులు చేసి మరీ వరి నాట్లు వేసుకుంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఏటా అర్హులైన రైతులకు రూ. 13,500 చొప్పున నగదు సాయం అందజేసి ఆదుకుంది. గత ఐదేళ్లలో కాకినాడ జిల్లాలో 1.75 లక్షల మంది రైతులకు రూ.1.675 కోట్ల మేర పెట్టుబడి సాయం అందింది. అయితే ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి నాయకులు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు సాయం అందజేస్తామని రైతులకు చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో రైతులకు ఎదురు చూపులే మిగిలాయి. ఖరీఫ్ సీజన్‌లో అందజేస్తారని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రస్తుత రబీ సీజన్‌లోనూ ప్రభుత్వం ఆ ఊసెత్తకపోవడంతో రైతులు బ్యాంకుల్లోనూ, బయట అప్పులు చేసి సాగు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతులను ఆదుకోవాలి



అధికారంలోకి వస్తే రైతులకు ఎంతో మేలు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా అన్నదాతల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. ఇప్పటి వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు సాయం పొందారు. ఇప్పుడు వాటిని నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుండడంతో ఎరువుల, విత్తనాల కొరత ఏర్పడింది. రబీ మొదలైనా అన్నదాత సుఖీభవ పథకం కింద అందజేస్తామన్న రూ.20 వేలు నగదు సాయం ఊసే ఎత్తడం లేదు. గతంలో పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించగా, ఇప్పుడు రైతులే చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా గతంలో అందించిన సేవలను కొనసాగించాలి. పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– రాయుడు శ్రీనివాస్, రైతు, యండమూరు, కరప మండలం

దగా చేయడం తగదు



ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు సాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసెత్తకపోవడం రైతులను దగా చేయడమే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అనేక రైతు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి రైతులను అన్నీ విధాలా ఆదుకున్నారు. రైతు భరోసా పథకం కింద ఏటా పెట్టుబడి సాయాన్ని అందజేసింది. ఆ ఐదేళ్ల రైతులు ఎంతో సంతోషంగా సాగు చేపట్టారు. ఇప్పుడు ప్రభుత్వం సాయం అందక సన్నకారు రైతులు రబీ సాగుకు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

– వి.సీతారామరాఘవ, విజయరాయుడుపాలెం, కరప మండలం

గత ప్రభుత్వంలో 20 రకాల సేవలు



రైతు భరోసా కేంద్రం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని రకాల సేవలను ఇంటి ముంగిటే అందించే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చింది. అందులో భాగంగా కాకినాడ జిల్లాలో 414 ఆర్బీకేలను ఏర్పాటు చేసింది. అందులో దాదాపుగా 278కి పైగా ఆర్‌బీకేలకు సొంతభవనాలుండగా మరికొన్ని కేంద్రాలను అద్దె భవనాల్లో ఏర్పాటు చేసింది. ఇంకొన్ని భవనాలు పలు దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఒక్కొక్క ఆర్బీకే నిర్మాణానికి రూ.23.94 లక్షల వంతున ఖర్చు చేసింది. రైతులకు సేవలు అందించేందుకు ఆర్బీకేల్లో ప్రత్యేక వ్యవసాయ అసిస్టెంట్‌లను ఏర్పాటు చేశారు. ఆర్బీకేల ద్వారా ఏటా రబీ సీజన్‌లో 6 వేలు, ఖరీఫ్ సీజన్‌లో4 వేల క్వింటాళ్లకు పైగా నాణ్యమైన విత్తనాలను రైతులకు ప్రభుత్వం రాయితీపై అందజేసింది. అకాల వర్షాలతో నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై మళ్లీ విత్తనాలను సైతం పంపిణీ చేసింది. ఏటా సుమారు రెండు వేల టన్నులకు పైగా ఎరువులను ఇంటి ముంగిటకే అందజేసింది. పంట నూర్పిళ్ల సమయంలో ఏటా 2.75 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు కనీస మద్దతు ధర అందించింది. ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడకుండా ఆర్బీకే సిబ్బంది ముందస్తుగా ఈ–క్రాప్ ద్వారా వివరాలు నమోదు చేసేవారు. ఏటా సుమారు 30 వేల మంది రైతుల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయడం ద్వారా మెరుగైన సేవలు అందించింది. ఆర్బీకేల ద్వారా రైతు భరోసా, పీఎం కిసాన్, పొలంబడి, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ, పంటల బీమా, తదితర సుమారు 20 రకాల సేవలు అందేవి. భూసార పరీక్షలు సైతం నిర్వహించి శాస్త్రీయ పద్ధతిలో నేల స్వభావాన్ని, సూక్ష్మ, స్థూల పోషకాలను అంచనా వేసి రైతులకు.. ఏ మేర ఎరువులు వేయాలి. ఏఏ పంటలు సాగు చేయాలి వంటి సూచనలు, సలహాలను సైతం అందజేసింది. తద్వారా రైతుల పెట్టుబడులు గణనీయంగా ఆదా అయ్యాయి. ఆర్బీకేల ద్వారా పంటల బీమా కూడా రైతులకు సులభంగా అందుబాటులోకి వచ్చింది. ఆర్బీకేల్లో ఉన్న రైతుల వివరాల ఆధారంగా సిబ్బంది ఉచిత పంటల బీమా చేయించడంతో పాటు ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం సైతం అందేది. జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో చెరువులు, బోర్లు కింద వరి సాగు చేస్తారు. మొత్తం మీద ఏదో ఒక పంట అయితే రైతులు సాగు చేస్తారు. పంట సాగును పర్యవేక్షించేందుకు వీఏఏలు క్షేత్ర స్థాయిలో పర్యటించి చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చిన కూటమి ప్రభుత్వం ఎరువుల పంపిణీని నిలిపివేసింది. విత్తనాలను అరకొరగా పంపిణీ చేస్తోంది. ఉచిత పంటల బీమాను సైతం నిలిపివేసింది. దీంతో రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం అవుతున్నాయి.

అధికారం మారడంతో పేదలకు ఇబ్బందులు



కన్నబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాల్

న్యూ ఇయర్ వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

కాకినాడ రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేయడంతో గత ఐదేళ్లు సంక్షేమ నామ సంవత్సరాలుగా భాసిల్లాయని, రాష్ట్రంలో ఇప్పుడు అధికారం మారడంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, అభిమానులు, జిల్లాలోని పలువురు నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, గజమాలలతో సత్కరించారు. కన్నబాబు మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఉచిత బీమా ఎత్తివేశారని, గిట్టుబాటు ధర బస్తాకు రూ.200 వరకు పడిపోయిందని, కనీసం పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదన్నారు. రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం పనిచేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలన్నారు. కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి పెంచారని, ఉచిత ఇసుక అని ప్రచారం చేసుకుంటున్నారని, లారీ ఇసుకకు రూ.23వేలు అవుతోందన్నారు. నూతన సంవత్సరంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుకుంటున్నామన్నారు. కన్నబాబుకు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, అల్లి రాజబాబు తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీ వివాదంలో ఘర్షణ


- ఒకరికి గాయాలు
- టీడీపీలో భగ్గుమన్న విభేదాలు



కాలి మీద గాయానికి కట్టుతో అంజిబాబు

ప్రత్తిపాడు: టీడీపీలో రెండు వర్గాల మధ్య జరిగిన ఫ్లెక్సీ వివాదంలో ఒకరు గాయపడిన ఘటన ఇది. మండలంలోని లంపకలోవ గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం సాయంత్రం ఫ్లెక్సీ కట్టే విషయమై ఈ వివాదం చోటు చేసుకుంది. టీడీపీలోని రెండు వర్గాల మధ్య రేగిన ఈ రగడ ఒకరిని కత్తి పోటుకు గురిచేసింది. టీడీపీలో ముందు నుంచి ఉన్న వర్గీయులకు, వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న సొసైటీ మాజీ అధ్యక్షుడు గొంతిన సురేష్ వర్గానికి పొసగడం లేదు. ఒక వర్గం ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుంటే గొంతిన సురేష్ వర్గీయులు అభ్యంతరం చెప్పడంతో వివాదం ముదిరింది. వివాదం ముదిరి పాకాన పడడంతో గొంతిన సురేష్ వర్గీయులు మరో వర్గం కార్యకర్త అవిడి అంజిబాబుపై కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన అంజిబాబును చికిత్స కోసం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఈ విషయమై ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మీకాంతంను వివరణ కోరగా ఇరు వర్గాలను విచారించి, కేసు నమోదు చేస్తామని చెప్పారు. ఈ సంఘటనతో టీడీపీలో అంతర్గతంగా ఉన్న విభేదాలు గుప్పుమన్నాయి. కాగా గొంతిన సురేష్ వర్గానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మద్దతు ఇస్తున్నారని ఓ వర్గం కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. టీడీపీ కార్యకర్తపై దాడి జరిగితే ఎమ్మెల్యే స్పందించలేదని వారు అంటున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అంతర్వేది ఉత్సవాలపై నేడు సమీక్ష



అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో వచ్చే నెల 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. దీనిపై గురువారం అంతర్వేదిలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అమలాపురం ఆర్డీఓ కె.మాధవి సమక్షంలో సమీక్ష జరగనుంది. ఉత్సవాల నిర్వహణపై ఆయా శాఖల అధికారులకు ఆమె దిశానిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే ఉత్సవాలకు సంబంధించిన ముహూర్త పత్రికను ఆలయ అర్చకులు, వేదపండితులు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. ఈ మేరకు దేవస్థానం ఆలయ ప్రాంగణంలో జరిగే సమావేశానికి తగిన ఏర్పాట్లు బుధవారం పూర్తి చేశారు. పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఫిబ్రవరి 7వ తేదీ రాత్రి 12–55 గంటలకు స్వామివారి కల్యాణం, 8వ తేదీ మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం, 12వ తేదీ పౌర్ణమి స్నానాలు, 13వ తేదీ సాయంత్రం తెప్పోత్సవం ఉంటుందని అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

96 రేషన్ షాపుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

కాకినాడ సిటీ: కాకినాడ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో వివిధ కారణాలతో ఖాళీలు ఏర్పడిన 96 చౌకధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించేందుకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుందన్నారు. దరఖాస్తు నమూనాను సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయం లేదా ఆర్డీవో కార్యాలయాల్లో ఆఫీసు పని వేళల్లో పొందవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పొందుపరిచిన నిబంధనలకు లోబడి ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలోగాని, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో గాని నేరుగాను, లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చన్నారు.

ఇక్కడ పార్కింగ్ ప్రమాదం సుమీ!

- ఒక వైపు లోయ..ఇంకో వైపు కొండ
- లోయ వైపు బారికేడ్స్ లేక వాహనదారులకు ఇబ్బంది



రత్నగిరి పై పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాలు

అన్నవరం: రత్నగిరి పై కొలువైన సత్యదేవుని ఆలయానికి వివిధ వాహనాలలో వచ్చే భక్తులు సత్యగిరి పక్కన కొండను చదును చేసి ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో తమ వాహనాలను నిలుపుతున్నారు. అయితే అక్కడ ఒక వైపు లోయ ఉంది. లోయ వైపు బారికేడ్స్ లేకపోవడంతో వాహనాలను పార్క్ చేయడానికి వాహనదారులు భయపడుతున్నారు. కోవిడ్ తరువాత వాహనాలలో సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తులు పెరిగారు. సాధారణ రోజుల్లో సుమారు వేయికి పైగా వాహనాలలో వస్తుంటే పర్వదినాలలో ఐదు వేలకు పైగా వాహనాలలో విచ్చేస్తున్నారు. గతంలో ఈ వాహనాలకు పార్కింగ్ స్థలం తక్కువగా ఉండేది. దాంతో రెండు ఘాట్‌రోడ్డులకు ఇరువైపులా వాహనాలను నిలిపివేయడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అయ్యేది. దీంతో వాహనదారులతో బాటు సామాన్య భక్తులు కూడా ఇబ్బంది పడేవారు. 2023లో ఈఓ గా పనిచేసిన ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ భక్తుల వాహనాలను నిలిపివేసేందుకు సత్యగిరి పక్కన కొండను చదును చేయించి మల్టీపర్పస్ పార్కింగ్ ప్లేస్ అభివృద్ధి చేశారు. ఇక్కడ సుమారు రెండు వేల వాహనాలను పార్క్ చేసే సదుపాయం కల్పించారు. ఈ పార్కింగ్ ప్లేస్‌లో ఒకవైపు కొండ మరో వైపు లోయ ఉన్నాయి. పార్కింగ్ చేసిన వాహనాలు పడిపోకుండా లోయ వైపు చిన్న గోడ లేదా బారికేడ్స్ నిర్మించాలని ఆయన ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అయితే ఆయన 2023 నవంబర్‌లో బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆ పార్కింగ్ ప్లేస్‌లో లోయవైపు ఎటువంటి గోడ లేదా బారికేడ్స్ నిర్మాణం జరగలేదు. సాధారణ రోజులలో ఇక్కడ కొండ వైపు వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. శని, ఆదివారాలు, దశమి, ఏకాదశి, పౌర్ణిమ వంటి పర్వదినాలలో మాత్రం వాహనాలు ఎక్కువగా వస్తుండడంతో లోయ వైపు కూడా వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. అయితే ఆ వాహనాలు నిలుపుదల చేయడంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా లోయలో పడిపోయే అవకాశం ఉంది. ఆ పార్కింగ్ స్థలంలో లోయ వైపు రక్షణ గోడ నిర్మించడం లేదా ఇనుప స్తంభాలతో బారికేడ్స్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

తీరంలో తాబేళ్ల మృత్యువాత

కాలుష్యమే కారణమంటున్న మత్స్యకారులు





బుధవారం ఉప్పాడ తీరానికి కొట్టుకొచ్చిన మృతిచెందిన తాబేళ్లు

కొత్తపల్లి: మండల పరిధిలో ఉన్న తీరప్రాంతంలో సముద్ర తాబేళ్లు తరచూ మృత్యువాత పడుతూ ఒడ్డుకు చేరుకుంటున్నాయి. సముద్రంలో రోజురోజుకు కాలుష్యం పెరగడం వలనే తాబేళ్లు మృతి చెందుతున్నట్టు స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. సముద్రం సమీపంలో ఉన్న హేచరీలు, పరిశ్రమలు విడుదల చేసే విషపూరితమైన రసాయనాలు కలిసిన నీటిని, వ్యర్థాలను సముద్రంలో విచ్చలవిడిగా విడిచిపెడుతున్నారు. ఈ కలుషిత నీరు కారణంగా సముద్రంలో జీవించే వందలాది తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం వల్ల పరిశ్రమలు విష రసాయనాలు సముద్రంలోకి యథేచ్ఛగా విడుదల చేస్తున్నాయని తీర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి సొసైటీ సీఈఓ మృతి


స్వామినాయుడు (ఫైల్)

అల్లవరం: దేవగుప్తం సొసైటీలో సీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న డి.రావులపాలేనికి చెందిన కొల్లా దుర్గా ప్రసాద్ స్వామినాయుడు (40) మంగళవారం రాత్రి విద్యుదాఘాతానికి మృతి చెందారు. తాడికోన డ్రైన్‌ను ఆనుకుని మృతుడి తండ్రి కొల్లా సత్యనారాయణ సాగు చేస్తున్న రొయ్యల చెరువుల వద్ద ఏరియేటర్లు ఆన్ చేయడానికి రాత్రి పది గంటల సమయంలో వెళ్లారు. అయితే చెరువు వద్దకు వెళ్లిన స్వామినాయుడు ఎంత సేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో చేతులు, శరీరం కాలిపోయి విగతజీవుడిగా కనిపించారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా స్వామినాయుడి మృతికి దేవగుప్తం సొసైటీ మాజీ అధ్యక్షుడు, ఏపీ అగ్రిమిషన్ మాజీ సభ్యుడు జున్నూరి రామారావు, అల్లవరం మండల సహకార ఉద్యోగులు సంతాపం తెలిపారు.

మింగేసిన రాకాసి అలలు


సూర్యారావుపేట బీచ్‌లో లక్ష్మీ నాగసాయి మృతదేహం వద్ద బంధువుల రోదన

- కాకినాడ బీచ్‌లో వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి
- మరొకరు గల్లంతు
- న్యూ ఇయర్ వేళ విషాదం


గౌరీ లక్ష్మీ నాగసాయి (ఫైల్)


సతీష్‌కుమార్ (ఫైల్)


శ్రీనుబాబు (ఫైల్)

కాకినాడ రూరల్: సముద్ర తీరాన రాకాసి కెరటం మృత్యువై లాగేసింది.. రెండు వేర్వేరు ఘటనల్లో మూడు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది.. కొత్త వత్సరం వారి ఇంట కన్నీరు మిగిల్చింది.. సరదాగా సముద్ర స్నానానికి దిగిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు మృతి చెందగా, మరొకరు గల్లంతు కావడం ఆందోళన రేకెత్తించింది. కొత్త సంవత్సరంలోకి కోటి ఆశలతో అడుగిడిన కొన్ని గంటల్లోనే వారి ప్రాణాలను సముద్రపు స్నానం మృత్యువై వెంటాడి మింగేసింది. ఆ వివరాల్లోకి వెళితే.. కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఓల్డ్ ఎన్టీఆర్, న్యూ ఎన్టీఆర్ బీచ్‌ల్లో బుధవారం సాయంత్రం అర గంట వ్యవధిలో వరుసగా చోటు చేసుకున్న రెండు సంఘటలలో ముగ్గురు గల్లంతవ్వగా, ఇందులో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాకినాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ శ్రీనగర్ ప్రాంతంలో హాస్టల్‌లో ఉంటున్న యు.కొత్తపల్లి మండలం కోనపాపపేట గ్రామం శివారు మల్లివారితోటకు చెందిన గుత్తుర్తి సతీష్‌కుమార్ (17) స్నేహితులతో కలసి తొలుత కోరంగి మడ అడవులకు వెళ్లాడు. అక్కడి నుంచి సాయంత్రం సూర్యారావుపేట బీచ్‌కు వచ్చారు. 4.30 గంటల సమయంలో సముద్రంలో స్నానం చేస్తుండగా రాకాసి కెరటాలు ఎగసి పడి గల్లంతయ్యాడు. వెంటనే తోటివారు ఒడ్డుకు చేర్చి అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. తమ కుమారుడి మృతిపై తండ్రి లక్ష్మీనారాయణ, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ సదరు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు.


న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో కొనసాగిన గాలింపు చర్యలు

- ఇదిలా ఉంటే మరో సంఘటన సమీపంలోని న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో ఐదు గంటలకు చోటు చేసుకుంది. కాకినాడ రామకృష్ణారావుపేట నుంచి ఐదుగురు సముద్రపు స్నానాలకు దిగారు. అలల కారణంగా ఇందులో పదో తరగతి చదివి మధ్యలో ఆపేసిన రామకృష్ణారావుపేట బాలాజీనగర్‌కు చెందిన వడిసెల గౌరీ లక్ష్మీనాగసాయి (16)తో పాటు పీఆర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కల్పనా సెంటర్ ఎర్రరోడ్డుకు చెందిన బొర్రా శ్రీనుబాబు (17) గల్లంతయ్యారు. నాగసాయి మృతదేహం లభ్యమైంది. శ్రీనుబాబు ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీనుబాబుకు తండ్రి లేకపోవడంతో తాత వద్ద ఉండి చదువుకుంటున్నాడు. రెండు ఘటనల్లో మృతదేహాలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్తంభించిన ట్రాఫిక్

కొత్త సంవత్సరం వేడుక కోసం సరదాగా గడిపేందుకు పెద్ద ఎత్తున జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సూర్యారావుపేట బీచ్‌కు తరలిరావడంతో సాయంత్రం వారు తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, ఎస్సై రవీంద్రబాబు, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు శ్రమించారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి గల్లంతు


శేరు వీరకనకరాజు (ఫైల్)

పి.గన్నవరం: వేటకు వెళ్లిన మత్స్యకారుడు గల్లంతైన ఘటన ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేసింది. ఈ ఘటన మండలంలోని కె.ఏనుగుపల్లి వద్ద వైనతేయ నదిలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన శేరు వీర కనకరాజు (41), అతని కుమారులు అశోక్, రాజేష్‌లతో పాటు మొత్తం 15 మంది మత్స్యకారులు వైనతేయ నదిలో చేపల వేటకు వెళ్లారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నదిలో అయిలు వల వేసి చేపలు వేటాడుతున్నారు. 3 గంటల సమయంలో రెండు వైపులా పడవలపై వెళ్లి అయిలును లాగుతున్నారు. ఈ నేపథ్యంలో అయిలుకు మధ్యలో ఓ కర్ర అడ్డు తగలడంతో దాన్ని తొలగింగేందుకు వీర కనకరాజు పడవపై వెళ్లాడు. ఆ కర్రను తొలగించే క్రమంలో నీటిలో దిగి 10 నిమిషాలైనా పైకి రాలేదు. మిగిలిన మత్స్యకారులు కంగారుపడి ఆ ప్రాంతానికి పడవలపై వెళ్లారు. నదిలో అతడి కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. అతడి కాలు వలలో చిక్కుకోవడంతో పైకి రాలేక నీట మునిగి గల్లంతయ్యాడని భావిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కొత్త సంవత్సరం తొలి రోజున మత్స్యకారుడు గల్లంతు కావడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.


నది ఒడ్డున విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కుమారుల కళ్లెదుటే..

కళ్లెదుటే తన తండ్రి నీట మునిగి గల్లంతు కావడంతో కుమారులు అశోక్, రాజేష్‌లు బోరున విలపిస్తున్నారు. అయిలుకు ఏదైనా అడ్డు తగిలితే ఆ బృందంలో.. వీర కనకరాజు మాత్రమే వెళ్లి నీటిలో దిగి అడ్డు తొలగించేవాడని తోటి మత్స్యకారులు వివరించారు. ఈ క్రమంలో నీటిలోకి దిగిన అతను పైకి రాకపోవడంతో కుమారులతో పాటు మిగిలిన వారు ఆందోళనకు గురయ్యారు. పడవలపై ఆ ప్రాంతానికి వెళ్లి గాలించినా జాడ తెలియలేదు. కళ్లెదుటే తండ్రి నీట మునిగితే కాపాడుకోలేకపోయామంటూ కుమారులు రోదిస్తున్నారు. కనకరాజు భార్య వెంకటరమణ నది ఒడ్డుకు చేరుకుని గుండెలవిసేలా రోదించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న అనూష

గోకవరం: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకున్న వేళ గోకవరంలో విషాదం నెలకొంది. భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుందని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గోకవరం గ్రామానికి చెందిన గండేపల్లి అనూష (24), షేక్ మీరా సాహెబ్‌లు ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. అనూష భర్త మద్యానికి బానిసై ఇటీవల కాలంలో ప్రతి రోజూ మద్యం తాగి ఆమెను అనుమానంతో మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. భర్త వేధింపులు తాళలేక బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనూష ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న అనూష కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. భర్త వేధింపుల కారణంగా తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. మృతురాలి తండ్రి వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా భార్య మృతి విషయం తెలుసుకున్న భర్త వీరబాబు పరారీలో ఉన్నాడు. తల్లి మృతి చెందడం, తండ్రి పరారీలో ఉండటంతో చిన్నారులు దిక్కుతోచని స్థితిలో ఉండటం చూపరులను కలచివేసింది. ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

సామర్లకోట: స్థానిక సీబీఎం సెంటర్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన కంచు వరాలమ్మ భర్తతో కలసి మోటార్ సైకిల్‌పై అన్నవరం సమీపంలోని కోడూరు వెళ్తుండగా సీబీఎం సెంటర్‌లో వెనుక నుంచి లారీ ఢీకొంది. దాంతో వరాలమ్మ బైక్ నుంచి కింద పడిపోగా లారీ ఆమె కాలుపై నుంచి వెళ్లింది. కాలు నుజ్జునుజ్జు కావడంతో వెంటనే స్థానికులు ఆమెను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. క్షతగాత్రురాలు అక్క మృతి చెందడంతో ఆమె చిన కార్యానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు వరాలమ్మ బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవునిపై భక్తి గీతాలు రాస్తా..

సినీ గీత రచయిత రామజోగయ్య శాస్త్రి


సత్యదేవుని సన్నిధిలో వేద పండితులతో మాట్లాడుతున్న రామజోగయ్య శాస్త్రి

అన్నవరం: దేవస్థానం అధికారులు కోరితే అన్నవరం సత్యదేవునిపై భక్తి గీతాలు రచిస్తానని ప్రముఖ సినీగేయ రచయిత రామజోగయ్య శాస్త్రి తెలిపారు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులతో కలసి రత్నగిరిపై సత్యదేవునిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు ఇచ్చారు. స్వామివారిపై భక్తి గీతాలు రచించాలని రామజోగయ్య శాస్త్రిని ఆలయ వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు కోరారు. సత్యదేవునిపై భక్తి గీతాలు చాలా తక్కువగా ఉన్నాయని, మీలాంటి రచయితలు అయితే జనబాహుళ్యంలోకి వేగంగా చొచ్చుకుపోయే గీతాలు రాయగలరని అన్నారు. దీనిపై ఆయన సమాధానమిస్తూ దేవస్థానం కోరితే తప్పక రాస్తానని తెలిపారు. గతంలో మాడుగుల నాగఫణిశర్మ స్వామివారిపై సుప్రభాతం, కొన్ని గీతాలు రాశారని వారు తెలిపారు. ఒకరోజు పూర్తిగా దేవస్థానంలోనే ఉండి ఆలయ చరిత్ర పూర్తిగా తెలుసుకుని ఆ చరిత్రకు తగ్గట్టుగా రాయాలని రామజోగయ్య శాస్త్రిని కోరగా, అందుకు ఆయన అంగీకరించారని వేద పండితులు వివరించారు.

తేగనచ్చేస్తాయ్...


నోరూరించే తేగలు

- నోరూరిస్తున్న తంపటి తేగలు
- రుచితో పాటు ఆరోగ్యం కూడా..
- జోరుగా విక్రయాలతో ఉపాధి


చింతలమోరిలో కాల్చిన తేగలను కట్టలు కడుతున్న కార్మికుడు


తేగలను తంపటి వేస్తున్న వ్యాపారి

మలికిపురం: 'తేగనచ్చేసే ఆహారం ఇది.. ఆరోగ్య ప్రదాయినీగా పేరొందింది.. అందుకే దీనికి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎంతో ప్రాధాన్యం ఉంది.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అందరూ ఇష్టపడి తినే తేగల విక్రయం కార్తిక మాసంలో వచ్చే నాగుల చవితి అనంతరం ప్రారంభం అవుతోంది. హిందూ సంప్రదాయంలో తేగలకు నాగుల చవితికి పురాణాల్లో అవినాభావ సంబంధం ఉంది. అందువల్ల నాగుల చవితి తర్వాతే తేగలను వెలికితీసి విక్రయిస్తారు. అలాగే ఆహార ప్రియులు నాగులు చవితి చేసిన తర్వాతే తేగలను తినడం మొదలు పెడతారు. అయితే మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా తేగల దిగుబడి డిసెంబర్ నుంచీ మొదలవుతుంది.

తాటి చెట్ల ద్వారా...

తేగలు తాడి చెట్ల నుంచే ఉద్భవిస్తాయి. వేసవిలో తాటికాయల కాపు మొదలవుతుంది. మార్చి, ఏప్రియల్ నెలల్లో తాటి ముంజులను విక్రయిస్తారు. అనంతరం కురిసే వర్షాల నాటికి తాటికాయలు తాటి పండ్లుగా మారతాయి. అలా రాలిన తాటి పండ్ల గుజ్జును వినియోగించి పిండి వంటలు కూడా పల్లెటూర్లలో తయారు చేస్తారు. అలా రాలిన కాయల టెంకలతో పాటు, తాడి చెట్ల నుంచి తాడి కాయలను దించి ప్రత్యేక ప్రాంతాల్లో రైతులు వ్యాపారులు తేగల పాతరలు వేస్తారు. రైతులు, వ్యాపారులు వారికి ఉన్న చెట్లను బట్టి వ్యాపార స్థాయిని బట్టి ఒక్కొక్కరు ఎకరం నుంచి రెండు ఎకరాల్లో కూడా వివిధ ప్రాంతాల్లో పాతర వేస్తారు. వీటికి ఎటువంటి ఎరువులు వేయరు. భూమి ఇసుక పొరలలో దృఢంగా పెరుగుతాయి. డిసెంబర్ నాటికి ఇవి తేగలుగా తయారవుతాయి.

సీజనల్ ఆహార పంటగా..

ప్రస్తుతం తేగలు, బుర్ర గుంజుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో తేగలు ప్రస్తుత సీజన్‌లో సమృద్ధిగా లభిస్తాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కేశనపల్లి, గూడపల్లి, పశ్చిమ గోదావరిలో మొగల్తూరు, ఇరగవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతూరు తేగలకు ప్రసిద్ధి. కోనసీమ తేగలు ఇతర ప్రాంతాలకూ ఎగుమతి అవుతున్నాయి. స్థానిక ప్రజలు దూర ప్రాంతాల్లో ఉన్న తమ బంధువులకు తేగలను పార్శిల్ చేసి పంపుతుంటారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంతో పాటు, ముంబయి, ఢిల్లీలకు కూడా తరలిస్తారు. కోనసీమలోని కేశనపల్లి, గూడపల్లి, చింతలమోరిలలో తేగలు రుచిగా ఉంటాయి. దీనికి ఇక్కడి ఎర్రటి ఇసుక నేలలే కారణమని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే చింతూరులో లభించే అటవీ తేగలకు కూడా మంచి రుచి ఉంటుంది.

అమ్మకాలతో ఉపాధి

తేగల అమ్మకంతో అనేక మంది ఉపాధి పొందుతున్నారు. సీజనల్ ఆహార పంటల వ్యాపారులు ఈ తేగల సీజన్ వచ్చిందంటే తేగలతో రోడ్లపైనా, ప్రధాన రహదాలు వెంబడి దుకాణాలను తెరుస్తారు. భూమిలో తయారైన తేగలను తవ్వి తీసి వాటిని ప్రత్యేక కుండలలో కాలుస్తారు. వాటిని తంపటి వేయడం అంటారు. ఇలా తంపటి వేస్తేనే అవి రుచిగా ఉంటాయి. రాత్రి తంపటి వేసిన తేగలను అలా కుండల నుంచి తీసి మంచులో ఉంచుతారు. అలా చేయడం వల్ల రుచితో పాటు ఆరోగ్యకారకంగా ఉంటాయి. ఉదయం వీటిని కట్టలుగా కట్టి విక్రయాలు చేస్తారు. సైజులుగా విభజించి కట్టలు కడతారు. సైజును బట్టి పది కట్ట రూ.50 నుంచి రూ.100 వరకూ విక్రయిస్తున్నారు.

బుర్ర గుంజుకూ డిమాండ్

తేగలను పాతర నుంచి తీసే సమయంలో తేగ మొలవడానికి కారణమైన తాటి టెంక (బుర్ర) కూడా బయటకు వస్తుంది. ఆ టెంకలను కత్తితో బద్దలు కొట్టి దానిలో మెత్తగా ఉండే గుజ్జును కూడా బయటకు తీస్తారు. ఇది కూడా చాలా రుచిగా ఉంటుంది. దీనిని ప్రత్యేక ప్యాకెట్లలో వేసి పావు కిలో రూ.50కి విక్రయిస్తున్నారు.

ఆహా ఆరోగ్యం..

తేగలు గుండె జబ్బులు, డయాబెటిస్ ఇలా ఎన్నో సమస్యలకు చెక్ పెడతాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బులను దూరం చేస్తాయి. నోటి సమస్యలను తగ్గించడానికి కూడా ఉపయోగపడతాయి. జీర్ణ సంబంధిత వ్యాధుల నుంచి కాపాడతాయి. డయాబెటిస్‌తో బాధపడే వారు వీటిని తింటే డయాబెటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. కాలేయానికి సంబంధించిన వ్యాధులు కూడా రాకుండా తాటి తేగలు మనకు ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. ఇన్ని ప్రయోజనాలను కలిగించే తాటి తేగలను ప్రతిరోజు క్రమం తప్పకుండా దొరికినప్పుడు ఒకటి చొప్పున తీసుకుంటే చాలా మంచిది. ఎటువంటి రసాయనాలు, ఎరువులు వాడకుండా పెరిగే ఈ తాటి తేగలు మంచి పోషకాహారంగా మనం చెప్పవచ్చు. వీటిల్లో ఉండే పీచు పదార్థం మన జీర్ణక్రియ సక్రమంగా జరగడానికి దోహదం చేస్తుంది. మన శరీరంలోని టాక్సిన్స్ బయటకు పంపించడానికి ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలని భావించే వారికి తాటి తేగలు బాగా ఉపయోగపడతాయి. వీటిని తినడం వల్ల ఎముకల దృఢత్వం పెరుగుతుంది. ఇవి మహిళల్లో ఆస్టియోపోరోసిస్ సమస్య రాకుండా అడ్డుకుంటాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు తెల్లరక్త కణాలను పెంచి, వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి.